క్లుప్తంగా

పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి



కేంద్ర మంత్రితో వేమిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్) : జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే మిథాని పరిశ్రమ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. కొడవలూరు మండలం బొడ్డువారిపాళెం గ్రామం వద్ద ఇప్పటికే భూమి కూడా కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం) : నగరంలోని సండే మార్కెట్ సమావేశ హాల్లో 'విజ్ఞాన వీచికలు–సండే మార్కెట్ క్యాలెండర్లు' పుస్తకావిష్కరణ సభ గురువారం నిర్వహించారు. విజ్ఞాన ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం విచ్చేసి పుస్తకావిష్కరణ చేశారు. తొలి ప్రతిని తెలుగు భాషోద్యమ నాయకుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డికి అందజేశారు. రచయిత ఈతకోట సుబ్బారావు, సండే మార్కెట్ అధ్యక్షుడు ఎండీ.హఫీజుద్దీన్, సభ్యులు శరవణన్, మురుగేషన్, ముత్తు, నాగేంద్ర, సతీష్‌కుమార్, గణేష్, రతీష్, హరి, నాగుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరస్పర కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్): పాతకక్షల నేపథ్యంలో ఇరువురు దాడి చేసుకున్న ఘటనలపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసులు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన మీరా మొహిద్దీన్‌కు నేతాజీనగర్‌కు చెందిన యాసీర్‌తో పాత గొడవలున్నాయి. కొంతకాలంగా వీరి మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 27వ తేదీ రాత్రి డైకస్‌రోడ్డు వద్ద మీరామొహిద్దీన్, యాసీర్‌లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదుల మేరకు గురువారం వేదాయపాళెం పోలీసులు కేసులు నమోదు చేశారు.

ప్రత్యామ్నాయ పునరావాసాన్ని చూపాలి



బాధితులతో మాట్లాడుతున్న కత్తి శ్రీనివాసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : పెన్నానది ఒడ్డున నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి కారణంగా ఇల్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ పునరావాసాన్ని వెంటనే చూపాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం పెన్నానది సమీపంలో బ్రిడ్జి కింద ఉన్న ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2012 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మూలం ప్రసాద్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

వైభవంగా మండల పూజలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా బొల్లినేని సుబ్బానాయుడు– రావమ్మ, శ్రీహరినాయుడు– శ్రీవిద్య, గాజుల రఘురామయ్య– విజయమ్మ, సాగ శీనుబాబు– కల్పన, కోటిరెడ్డి– వెంకటలక్ష్మి, సుదీప్‌చంద్ర– హిమప్రియ, ఓజిలి శ్రీనివాస్‌రెడ్డి– పవిత్ర దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్పసేవా సమాజం పాలక మండలి పర్యవేక్షించింది.

అరిగెపూడి మృతి తీరనిలోటు

నెల్లూరు(బృందావనం) : విద్య, వైద్య, వ్యవసాయ, కళారంగాలకు విశిష్ట సేవలందించిన ఏవీకే ఫౌండేషన్ అధ్యక్షుడు అరిగెపూడి విజయకుమార్ (74) మరణం తీరనిలోటు అని ఆ ఫౌండేషన్ జిల్లా ఆర్గనైజర్ కేతా సుబ్బారావు గురువారం తెలిపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారన్నారు. ఆయన అంతిమయాత్ర జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కాగా అరిగెపూడి మృతి జిల్లాకు తీరనిలోటు అని కళాకారుల సంక్షేమ సంఘం నేతలు ఎన్వీ రమణయ్య, గోవర్ధన్ తెలిపారు.

పెళ్లి బాజాకు వేళాయె

- డిసెంబర్‌లో పెద్ద సంఖ్యలో వివాహాలు
- 4, 7, 10వ తేదీల్లో మంచి ముహూర్తాలు
- వచ్చే నెల 25 వరకు శుభకార్యాలు



నెల్లూరు(బారకాసు) : ప్రతిఒక్కరి జీవితంలో వివాహబంధం కీలకమైన ఘడియ. తమ పిల్లల వివాహాలను అత్యంత వేడుకగా జరిపించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతుంటారు. ఈ క్రమంలో కొన్ని సందర్భాల్లో ముహూర్తాల్లేక నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో డిసెంబర్‌లోని వివిధ తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. దీంతో నెల్లూరులో పెళ్లి సందడి నెలకొంది. కల్యాణ మండపాలకు డిమాండ్ పెరగ్గా.. పురోహితులు బిజీబిజీగా ఉండనున్నారు.

వివాహాల సీజన్ సమీపిస్తోంది

బ్రహ్మచారులు కొత్త బంధంలో ఒదిగిపోయేందుకు సిద్ధమవుతున్నారు. పెళ్లి ఏర్పాట్లకు వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. నగలు, వస్త్రాలు, కల్యాణ మండపాలు, సన్నాయి, కేటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. నగలు, వస్త్ర దుకాణాల్లో షాపింగ్ కళ పెరిగింది. పెళ్లి బంధం ప్రతిఒక్కరి జీవితంలో అత్యంత కీలక ఘట్టం. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆచితూచి శుభఘడియలను ఎంచుకుని ముడేస్తారు. తద్వారా వారి వివాహ బంధం ఎలాంటి ఆటుపోట్లకు లోనవకుండా ఉండాలని కోరుకుంటారు.

మార్గశిరలో మంచి రోజులు

మార్గశిర(డిసెంబర్) మాసంలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈ మాసంతో పాటు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో కూడా జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగనున్నాయి. మార్గశిర మాసంలో బలమైన ముహూర్తాలు ఉండటంతో పాటు జనవరిలో పుష్యమాసం కావడం.. మార్చి రెండో వారం నుంచి శుక్ర మౌఢ్యమి (మూఢం) రానుండటంతో ఇప్పుడున్న ముహూర్తాల్లోనే వివాహాలు చేయాలని పెద్దలు ఆరాటపడుతున్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి మార్గశిర మాసం ప్రారంభం కానుండటంతో వివాహాలు అధిక సంఖ్యలో జరుగనున్నాయి. తెలుగునాట మాఘం, వైశాఖం, శ్రావణ మాసాల తరువాత మార్గశిర మాసంలోనే ఎక్కువగా వివాహాలు జరుగుతుంటాయి.

జనవరిలో ముహూర్తాల్లేవు

డిసెంబర్ 25 తరువాత నుంచి జనవరి 30వ తేదీ వరకు పుష్యమాసంలో వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలు పెద్దగా చేయరు. జనవరి 31 నుంచి మార్చి 7వ తేదీ వరకూ మాఘమాసంలో ముహూర్తాలున్నాయి. మార్చి 13 నుంచి శుక్ర మౌఢ్యమి (మూఢం) మొదలు కానుండటంతో ముహూర్తాల కోసం మళ్లీ నెల రోజులకు పైగా వేచి ఉండక తప్పదు. ఈ కారణాలతో మార్చి 7లోపు వివాహాలు చేసేందుకు అధిక మంది ఆరాటపడుతున్నారు.

25 వరకు శుభ ముహూర్తాలు

మార్గశిర మాసంలో డిసెంబర్ 4వ తేదీ బుధవారం బలమైన ముహూర్తాలున్నాయని పురోహితులు, సిద్ధాంతులు చెబుతున్నారు. ఆరోజు రాత్రి 7.54 గంటలకు తెల్లవారుజామున 4.28 గంటలకు (తెల్లవారితే గురువారం), అలాగే 5, 6 తేదీల్లో ముహూర్తాలున్నాయి. 7న కూడా అతి పెద్ద ముహూర్తాలున్నాయి. ఆరోజు రాత్రి 7.50, తెల్లవారుజామున 4.24 (8వ తేదీ ఉదయం) రికార్డు స్థాయిలో వివాహాలు జరుగనున్నాయి. అలాగే 10వ తేదీ సైతం అధిక సంఖ్యలో వివాహాలు జరపనున్నారు. డిసెంబరు 11, 14, 20, 22, 24, 25 తేదీల్లో పెళ్లిళ్లతో పాటు వివిధ శుభ కార్యక్రమాలకు సైతం మంచి ముహూర్తాలున్నాయి.

7న పెద్ద ముహూర్తం



డిసెంబర్ పొడవునా ముహూర్తాలున్నాయి. 7వ తేదీ అతి పెద్ద ముహూర్తం. ఆ రోజున అధిక సంఖ్యలో వివాహాలు జరుగనున్నాయి. డిసెంబర్ 22వ తేదీ ఆదివారం సైతం పెద్ద ఎత్తున వివాహాలు జరుగనున్నాయి. జనవరిలో పుష్య మాసం కావడంతో పెద్దగా ముహూర్తాలు లేవు. ఈ కారణంగా డిసెంబర్‌లోనే ఎక్కువగా వివాహాలు జరిగే అవకాశాలున్నాయి.

– సత్యనారాయణమూర్తి, పురోహితుడు, నెల్లూరు నగరం

అర్బన్ మార్కెట్లను ప్రోత్సహించండి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలోని అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను ప్రజలంతా సందర్శించి, ప్రోత్సహించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ ఆకాంక్షించారు. స్థానిక స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధిలో ఏర్పాటు చేసిన విక్రయ స్టాల్స్‌ను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలిపారు. వినూత్న ఆలోచనలతో వివిధ రకాల గృహ అవసరమైన ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసి వారి ఆర్థిక అభ్యున్నతికి సహకరించాలని కోరారు. స్టాల్స్‌లో ప్రతిఒక్కరి ఇంటికి అవసరమైన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులతో ప్రేమగా మెలగాలి



మాట్లాడుతున్న జిల్లా ఎయిడ్స్, క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్) : హెచ్‌ఐవీ బాధితులతో ప్రేమగా మెలగాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని పెద్దాస్పత్రి ఆవరణలో ఉన్న ఏఆర్‌టీ సిబ్బందితో సమన్వయ సమావేశాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కొంత కాలంగా హెచ్‌ఐవీ రోగులు తగ్గుముఖం పడుతుండటం మంచి పరిణామమన్నారు. ఎంతో కాలంగా హెచ్‌ఐవీ రోగులు మందుల కోసం ప్రతినెలా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ క్లినిక్‌కు వస్తున్నారని తెలిపారు. సిబ్బంది రోగులతో మంచిగా మాట్లాడాలని, మందులు ఇచ్చి వారి ఆరోగ్యం మెరుగు పడిందా అని ఆరాతీయాలన్నారు. అప్పుడే వారిలో ఆత్మన్యూనతా భావం తగ్గుతుందన్నారు. రోగులను ఇబ్బంది పెట్టకుండా వారికి సరైన సలహాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

రీసర్వే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

- జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు రూరల్ : రీసర్వే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నెల్లూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లతో జేసీ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణంలో తేడా రావడం వంటి పలు సమస్యల పరిష్కారానికి వచ్చిన అర్జీలు, గిరిజన సమస్యలపై ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చెరువుల ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ ట్యాక్స్ వసూలు చేయాలన్నారు. ప్రతిరోజూ రెవెన్యూ డివిజనల్ అధికారులు మండల స్థాయిలో పెండింగ్ అంశాలపై సమీక్ష చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, నెల్లూరు ఆర్డీఓ అనూష, ఆత్మకూరు ఆర్డీఓ పావని పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో పోటీలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గిరి

నెల్లూరు (టౌన్) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు వక్తృత్వ, రీల్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్, హెచ్‌ఐవీ వ్యాధిపై కళాశాల ప్రిన్సిపల్ గిరి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వింధ్యావతి, వైస్ ప్రిన్సిపల్ రమణారావు, క్లబ్ సభ్యులు అనిత, నాగశ్యామల, మనోజ్‌ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

నెల్లూరు (టౌన్) : విజయనగరం జిల్లా బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో లీడర్‌షిప్ ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లో గుండెపోటుతో మృతిచెందిన ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావుకు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సురేంద్రరెడ్డి, సెక్రటరీ జనరల్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఉపాధ్యాయుల జీవితాలతో ఆడుకుంటున్న రాష్ట్రస్థాయి అధికారుల మొండి వైఖరి నశించాలన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులకు మండల, డివిజన్ కేంద్రాల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణా ఇవ్వాలని, లేనిపక్షంలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

లేకుంటే ఉపాధ్యాయులందరూ శిక్షణా కార్యక్రమాలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

నేత్రదానం



అమర్‌నాథ్(ఫైల్)

నెల్లూరు(అర్బన్) : కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జి.అమర్‌నాథ్(32) గురువారం ఉదయం ప్రమాదవశాత్తు మరణించారు. మల్లవరం గీతాకృష్ణ సహకారంతో మృతుని కుటుంబ సభ్యుల అనుమతితో అమర్‌నాథ్ నేత్రాలను నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సాంకేతిక నిపుణుడు సునీల్ మృతుని నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదాన మోటివేటర్ బాలాజీ మాట్లాడుతూ నేత్రదానం చేయదలచిన వారు 95595 89321, 93471 11033 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

మహిళలను వేధిస్తే కేసుల నమోదు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

నెల్లూరు(అర్బన్) : పని ప్రదేశాల్లో మహిళలను లైంగిక వేధింపులకు గురిచేసే వారిపై కఠినమైన కేసులు నమోదు చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం(పీఓఎస్‌హెచ్)పై దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గురువారం నర్సింగ్, మహిళా సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న మహిళల గౌరవానికి భంగం కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆ సంస్థ యాజమాన్యంపై ఉంటుందన్నారు. అనంతరం లోక్ అదాలత్ ద్వారా పొందగలిగే ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, అడ్మినిస్ట్రేటివ్ హెచ్‌ఓడీ డాక్టర్ కళారాణి, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యం

- కలెక్టర్ ఆనంద్



పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్

నెల్లూరు రూరల్ : బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం–2.0 పోస్టర్‌ను ఆయన గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల, గ్రామస్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. బాలికలకు విద్య, ఐరన్ లోపం, ఆరోగ్యం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, యోగా, ఫిట్‌నెస్ తదితర అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి హేనాసుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఉమెన్స్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష పీఓ ఉషారాణి పాల్గొన్నారు.

విస్తృతంగా అవగాహన ర్యాలీలు



మాట్లాడుతున్న సొసైటీ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రారంభించిన బాల్య వివాహ రహిత భారత్ ప్రచారాన్ని అధికారుల ఆదేశాల మేరకు చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆ సొసైటీ ప్రెసిడెంట్ ఐ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ బాలల రక్షణ హక్కుల కోసం పనిచేస్తుందని తెలిపారు. మా సొసైటీ జాతీయ నెట్‌వర్క్ జస్ట్ ఫర్ చిల్డ్రన్ కూటమిలో రిజిస్టర్ అయిందని, ఇప్పటివరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని, బాల్య వివాహాలను అరికట్టే విధంగా మా వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఫేక్ వీడియోలతో తప్పుడు ప్రచారం

నెల్లూరు రూరల్ : కొందరు ఉద్దేశపూర్వకంగా ఫేక్ వీడియోలు సృష్టించి హోటళ్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని జిల్లా హోటల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ హోటల్ పరిశ్రమ లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని, తనిఖీలకు వచ్చే అధికారులు మీడియాను తీసుకురావడం వల్ల ప్రజల్లో చెడ్డపేరు వస్తుందన్నారు. తమను బ్లాక్ మెయిల్ చేసే వారిని ఉపేక్షించబోమని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాయింట్ సెక్రటరీ కుమార్, సెక్రటరీ రవి, ట్రెజరర్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మురళి పాల్గొన్నారు.

'అపోలో'లో లంగ్ లైఫ్ స్క్రీనింగ్ పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్

నెల్లూరు(అర్బన్) : అపోలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో లంగ్‌లైఫ్ పేరుతో ఊపిరితిత్తుల స్క్రీనింగ్ పరీక్షలను ప్రారంభించామని ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో ఊపిరితిత్తుల స్క్రీనింగ్ పరీక్షలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల కేన్సర్‌లు అధికంగా నమోదవుతున్నాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా నివారించడానికి స్క్రీనింగ్ పరీక్షలను ప్రవేశపెట్టామన్నారు. కార్యక్రమంలో అంకాలజీ ఫిజిషియన్ డాక్టర్ హరిత, అంకాలజీ సర్జన్ డాక్టర్ మనోభిరామ్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ శ్రావణి, పల్మనాలజిస్ట్ ఉమామహేష్ మాట్లాడారు.

నేత్రపర్వం.. ప్రాకారోత్సవం



మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి గురువారం ఉదయం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామికి వెండి నంది ప్రాకారోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉభయకర్తలుగా నారపనేని శ్రీనివాసులు– విలాసిని, కాటంరెడ్డి గోపాల్‌రెడ్డి– విజయలక్ష్మి దంపతులు కుటుంబసభ్యులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ జంజం శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

– నెల్లూరు(బృందావనం)


ఆదర్శప్రాయులు జ్యోతిరావు పూలే



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు, అధికారులు

నెల్లూరు రూరల్ : భారతదేశ సామాజిక ఉద్యమ చరిత్రలో జ్యోతిరావు పూలే స్థానం చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకు, బాలికా విద్య కోసం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. ప్రతిఒక్కరూ పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్‌ఓ ఉదయ భాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏఓ విజయకుమార్, జిల్లా బీసీ సంక్షేమాధికారి ప్రసూన, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (టౌన్) : స్థానిక కొండాయపాళెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వర్రావు, విద్యా వలంటీర్ రాశి పాల్గొన్నారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్), (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని విద్యుత్ భవన్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్‌శాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, డీఈఈ మునీంద్ర, పర్సనల్ ఆఫీసర్ సురేష్, మాధవి, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్ పాల్గొన్నారు.
- డీసీఓ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి డీసీఓ గుర్రప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మినీబైపాస్‌రోడ్డులో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి బీసీ సంఘ నాయకులు, బీసీ సంక్షేమాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమాధికారి ప్రసూన, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సుధాకర్, సూపరింటెండెంట్ బాలాజీనాయక్ పాల్గొన్నారు.
- నగరంలోని సీమాంధ్రా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, నేతలు శీనయ్య, మస్తానయ్య, దయాకరయ్య, రాము ఆచారి, మురళి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.
- మినీబైపాస్ రోడ్డులోని పూలే విగ్రహానికి జనసేన నాయకులు నివాళులర్పించారు.



జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్



విద్యుత్ భవన్‌లో..



డీసీఓ కార్యాలయంలో..



బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో..